సాక్షి ఆదిలాబాద్

బుధవారం। 15। మార్చి। 2023



అర్ధరాత్రి కంటైనర్ హైజాక్
ఇచ్చోడ సరిహద్దులోని 44వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కంటైనర్‌ను హైజాక్ చేసిన ఘటన సంచలనం సృష్టించింది. 8లో▸

మేలుకో.. తెలుసుకో..



మనం కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు తప్పనిసరిగా రశీదు పొందాలి. ఒకవేళ ఆ వస్తువు నాణ్యత లోపం ఉన్నట్లయితే న్యాయ పోరాటం చేసేందుకు మనకున్న ఏకైక మార్గం అదే. 8లో▸

గరిష్టం/కనిష్టం
36.0/21.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి



శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న పద్మభూషణ్‌రాజు

ఆదిలాబాద్‌టౌన్: మహిళలు అన్ని రంగాల్లో ముందుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పద్మభూషణ్ రాజు అన్నారు. వృత్తి నైపుణ్య మంత్రిత్వశాఖ జన శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వారోత్సవాలను జిల్లా కేంద్రంలోని జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ శ్యామల మాట్లాడుతూ, జిల్లాలోని ఆయా మండలాల్లో 1800 మందికి వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తూ వారి జీవనోపాధికి అడుగులు వేస్తున్నామని తెలిపారు.అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, చైర్మన్ ఆర్.సురేందర్, ఐటీఐ ప్రిన్సిపాల్ సుజాత, ట్రైనర్ శ్రీనివాస్, జన శిక్షణ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ రాజన్న, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ తిరుపతి పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో..
ఆదిలాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. మహిళా పంచాయతీ సెక్రెటరీలు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లకు ఆటల పోటీలు నిర్వహించారు. డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి పోటీలను ప్రారంభించి మాట్లాడారు. మహిళలు అవకాశాలను అందిపుచ్చుకుంటూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఏసీఎం జగన్, డీఎల్పీవో ధర్మారాణి, ప్రిన్సిపాల్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణలో సాంకేతికత పాటించాలి

బజార్‌హత్నూర్: సాగు సస్యరక్షణ చర్యల్లో సాంకేతికత పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య అన్నారు. మండలంలోని అంధుగూడ, జాతర్ల గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. జొన్న, మొక్కజొన్న పంటలు పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందించారు. పిప్పిరి, బజార్‌హత్నూర్ రైతు వేదికలను తనిఖీ చేసి రైతులకు మెరుగైన సేవలందించాలని వ్యవసాయాధికారి ప్రమోద్‌రెడ్డికి సూచించారు. ఆయ న వెంట ఏఈఓలు సంతోష్, రామ్, సంజీవ్, రైతులు తదితరులున్నారు.

తుది జాబితా విడుదల

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లో ఫిజియోథెరపిస్ట్ పోస్టుకు వైద్యారోగ్యశాఖ ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈమేరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తుది జాబితాను మంగళవారం విడుదల చేసినట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ ప్రకటనలో తెలిపారు. జాబితాను కార్యాలయ నోటీసుబోర్డుతో పాటు adilabad. telangana. gov. in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు పేర్కొన్నారు.

19వరకు శనగ కొనుగోళ్లకు బ్రేక్

కైలాస్‌నగర్: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో శనగ విక్రయాలను నిలిపివేస్తున్నట్లు మార్క్‌ఫెడ్ డీఎం గౌరీ నాగేశ్వర్ ప్రకటనలో తెలిపారు. 20వ తేదీ నుంచి కొనుగోళ్లు తిరిగి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి

ఆదిలాబాద్‌టౌన్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పుప్పాల శ్రీనివాస్ ప్రకటనలో కోరారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపరాదని పేర్కొన్నారు. వాహనాల పన్ను చెల్లించని వారు తక్షణమే మీసేవ కేంద్రాలతో పాటు ఆర్టీవో కార్యాలయంలో చెల్లించాలని సూచించారు. స్వచ్ఛందంగా పన్ను చెల్లిస్తే రాయితీ ఉంటుందని, తనిఖీల్లో పట్టుబడితే మాత్రం 200 శాతం పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

పట్టుబడ్డ వాహనాల వేలం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎక్సైజ్ సీఐ కార్యాలయ పరిధిలో పట్టుబడ్డ వాహనాలకు మంగళవారం వేలం నిర్వహించారు. తొమ్మిది వాహనాలకు సంబంధించి రూ.2,36,590 సమకూరినట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. వీటిలో సుమో, ఆటో, ఏడు ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సైలు సంజయ్‌కుమార్, సంధ్యారాణి, హెడ్‌కానిస్టేబుల్ సుధ, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ బాలికల కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈవో రవీందర్‌కుమార్

విజయీభవ..

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- నేడు ఫస్టియర్, రేపటి నుంచి సెకండియర్ షురూ
- నిమిషం ఆలస్యమైనా నోఎంట్రీ
- విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి

జిల్లాలో పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు

	జనరల్	ఒకేషనల్	మొత్తం
ఫస్టియర్	8,927	1,095	10,032
సెకండియర్	8,442	922	9,364
బ్యాక్‌లాగ్	349	80	429

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు నేటి నుంచి షురూ కానున్నాయి. బుధవారం నుంచి ప్రథమ సంవత్సరం, గురువారం నుంచి సెకండియర్ ఎగ్జామ్స్‌ప్రారంభం కానున్నాయి. ఈమేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కొనసాగుతాయి. నిమిషం ఆలస్యం నిబంధన ఉండడంతో విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలని సంబంధిత అధికారులు సూచిస్తున్నారు. నిర్దేశిత సమయం మించితే కేంద్రంలోనికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫర్నిచర్, తాగునీరు, ఫ్యాన్లు, వైద్యసేవలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 30పరీక్ష కేంద్రాలు
ఇంటర్ పరీక్షల కోసం జిల్లా వ్యాప్తంగా 30 కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, రెండు సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలలు, ఐదు ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు, తొమ్మిది ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, ఒక మోడల్ స్కూల్‌ను కేటాయించారు. ఆయా కేంద్రాల్లో మొత్తం 19,915 మంది పరీక్షలకు హాజరు కానున్నారు.

పకడ్బందీ చర్యలు
పరీక్షల నిర్వహణ కోసం 30 మంది చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్), 30 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు (డీవో), తొమ్మిది మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు (ఏసీఎస్), 950 మంది ఇన్విజిలెటర్లను నియమించారు. మాస్‌కాపీయింగ్ జరగకుండా రెండు ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు.

ఆన్‌లైన్ ద్వారా కూడా హాల్‌టికెట్లు..
ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఫీజులు చెల్లించలేదని యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వకుంటే మనస్తాపం చెందనవసరం లేదు. ఆన్‌లైన్‌లో tsbie. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆ హాల్‌టికెట్‌తో నేరుగా పరీక్షకు హాజరు కావచ్చని అధికారులు సూచించారు. ఇబ్బందులకు గురయ్యే విద్యార్థులు 9848781808, 08732–297115 నంబర్‌కు సమాచారం అందించవచ్చు.

పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు..
పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా ఫర్నిచర్, తాగునీటి వసతితో పాటు వైద్యారోగ్యశాఖ ద్వారా ప్రథమ చికిత్స కోసం సిబ్బందిని నియమించారు. అలాగే పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచనున్నారు. ప్రశ్నపత్రాలను సీసీ కెమెరాల సమక్షంలో తెరవనున్నారు. అలాగే పరీక్ష ముగిసిన తర్వాత సీసీ సమక్షంలోనే సీజ్ వేయనున్నారు.

ప్రశాంతంగా పరీక్షలు రాయాలి..
విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మాస్‌కాపీయింగ్ నిరోధించేందుకు ప్రత్యేక బృందాలను నియమించాం. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలి. హాల్‌టికెట్లను వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకొని నేరుగా పరీక్షకు హాజరు కావచ్చు. ఏవైనా సందేహాలు ఉంటే డీఐఈవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.
– రవీందర్ కుమార్, డీఐఈవో

మంజూరు సరే.. పనులేవి?



ఇది బేల మండలంలోని పాటన్ గ్రామ పంచాయతీ కార్యాలయం. పక్కా భవనం లేకపోవడంతో గ్రామంలోని ఓ పెంకుటిల్లును అద్దెకు తీసుకుని ఏళ్లుగా ఇందులోనే కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. దీనికి పక్కా భవనం మంజూరై నాలుగు నెలలవుతున్నా ఇప్పటికీ పనులు ప్రారంభించ లేదు. కనీసం స్థలాన్ని సైతం గుర్తించకపోవడం గమనార్హం.

- ముందుకు సాగని పంచాయతీ నూతన భవన నిర్మాణాలు
- నాలుగు నెలలవుతున్నా షురూ కాని పనులు
- స్పందించని సర్పంచ్‌లు
- చొరవ చూపని అధికారులు

జిల్లాలో గ్రామ పంచాయతీలు	468
కొత్తగా ఏర్పాటైన పంచాయతీలు	226
అద్దె భవనాల్లో కొనసాగుతున్నవి	100
పక్కా భవనాలు కలిగినవి	205
కొత్త భవనాలు మంజూరైన జీపీలు	125
పనులు ప్రారంభించినవి	03

మండలాల వారీగా గ్రామపంచాయతీలకు మంజూరైన నూతన భవనాల వివరాలు

మండలం	మంజూరైన భవనాల సంఖ్య
ఆదిలాబాద్‌రూరల్	09
బేల	06
జైనథ్	13
గాదిగూడ	07
నార్నూర్	05
బజార్‌హత్నూర్	12
భీంపూర్	11
బోథ్	07
ఇచ్చోడ	12
గుడిహత్నూర్	05
నేరడిగొండ	08
సిరికొండ	03
తలమడుగు	05
తాంసి	03
ఇంద్రవెల్లి	08
ఉట్నూర్	11

కైలాస్‌నగర్: అద్దె, శిథిలావస్థకు చేరిన పంచాయతీ భవనాల్లో పాలకవర్గాల సమావేశాల నిర్వహణకు ఇక్కట్లను తొలగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరు చేసింది. ఒక్కో పంచాయతీకి రూ.20లక్షల చొప్పున నిధులు కేటాయిస్తూ గతేడాది డిసెంబర్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని 125 జీపీలకు పక్కా భవనాలు మంజూరయ్యాయి. వీటికి కలెక్టర్ పాలన అనుమతులు సైతం ఇచ్చారు. నాలుగు నెలలవుతున్నా పనులు మాత్రం ప్రారంభం కాకపోవడం గమనార్హం.

ఇబ్బందులు దూరం చేయాలనే..
జిల్లాలో 100 వరకు జీపీలు అద్దె భవనాల్లో, మరో 163 వరకు కమ్యూనిటీ హాళ్లు, ఐకేపీ, పాఠశాల వంటి ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. వీటిలో చాలావరకు ఒకటి, రెండు ఇరుకు గదుల్లోనే పాలన సాగిస్తున్నాయి. దీంతో రికార్డులు భద్రపరిచేందుకు, ఉద్యోగులు, సిబ్బంది కూర్చునేందుకు సైతం వసతి లేని పరిస్థితి. ముఖ్యంగా పాలకవర్గాల సమావేశాలు నిర్వహించుకోలేని దుస్థితి. ఇలాంటి సమస్యలను దూరం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు పక్కా భవనాల మంజూరుకు ప్రాధాన్యతనిచ్చింది. ఈ క్రమంలో జిల్లాలో 125 పంచాయతీలను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో ఏజెన్సీ ప్రాంతాల్లోని జీపీలకు ప్రాధాన్యతనిచ్చింది.

ఆశ.. నిరాశే
పక్కా భవనాల మంజూరుతో తమ సమస్యలు తీరుతాయని ఆయా పాలకవర్గాలతో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అయితే మంజూరై నాలుగు నెలలవుతున్నా ఇంకా పనులు ప్రారంభించకపోవడంతో వారిలో నిరాశ వ్యక్తమవుతోంది. ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో రావనే ఉద్దేశంతో సర్పంచ్‌లు వెనుకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. మరికొన్ని చోట్ల నిర్మాణాలకు అవసరమైన స్థలాలు అందుబాటులో లేవు. వాటిని గుర్తించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉంటుంది. అయితే పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో ఇప్పటి వరకు స్థలాల జోలికే వెళ్లలేదు. నిర్మాణాలు ప్రారంభించేలా చూడాల్సిన పంచాయతీరాజ్ శాఖ అధికారులు వాటిపై అంతగా దృష్టి సారించడం లేదు. తమకేం సంబంధం అన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో నిర్మాణ పనుల ప్రారంభానికి ఇంకెంతకాలం పడుతుందో తెలియని పరిస్థితి.

సీసీ రోడ్లకే ప్రాధాన్యమిస్తున్నారు
గ్రామాలకు కొత్తగా సీసీ రోడ్లు మంజూరయ్యాయి. వాటి పనులు త్వరగా పూర్తవుతాయనే ఉద్దేశంతో సర్పంచ్‌లు ఎక్కువగా వాటికే ప్రాధాన్యతనిస్తున్నారు. పంచాయతీ భవనాలు పూర్తి కావాలంటే దీర్ఘకాలం పడుతుందని, బిల్లులు కూడా సకాలంలో అందవనే ఉద్దేశంతో వారు ముందుకు రావడం లేదు. దీంతో కొత్త భవన నిర్మాణాలు పూర్తి స్థాయిలో ప్రారంభం కాలేదు. నార్నూర్ మండలంలో మూడింటి పనులు ఇటీవల ప్రారంభించాం. స్థలాల కొరత లేదు. నూతన ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి భవన నిర్మాణాలు ప్రారంభించేలా చూస్తాం. – మహావీర్, పీఆర్ ఈఈ

సమస్యల పరిష్కారానికే 'పుర ప్రజావాణి'

కైలాస్‌నగర్: పట్టణ ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే ప్రజావాణి నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ శైలజ తెలిపారు. మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన పురప్రజావాణిలో ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. ఇంటి, నల్లా పన్నులు, పేరు మార్పిడి, అక్రమణలకు సంబంధించి ఈ వారం మొత్తం 32 అర్జీలు అందాయి. ఇందులో అత్యధికంగా రెవెన్యూ విభాగానికి సంబంధించే 24 ఉండడం గమనార్హం. అలాగే టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి 6, శానిటేషన్, ఇంజనీరింగ్ సెక్షన్లకు సంబంధించి ఒక్కో అర్జీ ఉన్నాయి. వాటిని పరిశీలించిన ఆమె సంబంధిత విభాగాల అధికారులకు అందజేస్తూ వెంటనే పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ శైలజ

కార్యక్రమంలో మేనేజర్ దివాకర్, డీఈ యూనస్, టీపీవో అనురాధ, టీఎంసీ భాగ్యలక్ష్మి, పెంటాజీ, రవీందర్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

- కలెక్టర్ రాహుల్‌రాజ్

బేల: పరిశుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మండలంలోని సాంగిడి గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ తీరుతో పాటు రైతు వేదిక, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. కంటి వెలుగు శిబిరం నిర్వహణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు పీహెచ్‌సీ, గ్రంథాలయ భవనాల స్థితిగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్, ఎంపీడీవో మహేందర్‌కుమార్, వైద్యాధికారి వంశీకృష్ణ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

జైనథ్ మండలంలో..
జైనథ్: మండలంలోని ఆనంద్‌పూర్, కూర, తరోడ గ్రామాల్లో కలెక్టర్ రాహుల్‌రాజ్ మంగళవారం పర్యటించారు. కూర గ్రామంలో నర్సరీని పరిశీలించారు. అక్కడి నుంచి ఆనంద్‌పూర్ ప్రాథమిక పాఠశాలకు చేరుకున్నారు. మన ఊరు–మన బడి పనుల పురోగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూర గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని సందర్శించారు.



సాంగిడిలో ఓ ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు.

పలు రోడ్లు పరిశీలన..
గతేడాది వర్షాకాలంలో భారీ వరదలకు దెబ్బతిన్న ఆనంద్‌పూర్ అంతర్రాష్ట్రీయ బ్రిడ్జిని కలెక్టర్ పరిశీలించారు. వెంటనే రహదారిని పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి తరోడ చేరుకున్న కలెక్టర్ ఇటీవల కుంగిన బ్రిడ్జిని పరిశీలించారు. కొత్త వంతెన నిర్మించే వరకూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. అడ, కంఠ రోడ్డు, లక్ష్మీపూర్–జామ్ని రహదారుల విస్తరణకు అవసరమైన నివేదికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తరోడ వాగుపై తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డుకు మరిన్ని పైప్‌లు వేసి, కల్వర్టును ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ గోవర్ధన్, తహసీల్దార్ రాఘవేంద్ర రావు, ఎంపీడీవో గజానన్‌రావ్, రైతుబంధు మండల కోఆర్డినేటర్ లింగారెడ్డి, తదితరులున్నారు.

పీజీ నీట్‌లో మెరిసిన రిమ్స్ జూడాలు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లోని 2016 బ్యాచ్‌కు చెందిన జూనియర్ డాక్టర్లు పీజీ నీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన ఆల్ ఇండియా పీజీ నీట్‌లో రిమ్స్‌లో జూనియర్ డాక్టర్లుగా విధులు నిర్వహిస్తున్న సింధూజకు జాతీయ స్థాయిలో 633, రాజ్‌కుమార్‌కు 820,యశ్వంత్‌కు 1071 ర్యాంకు వచ్చినట్లు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ర్యాంకర్లను అభినందించారు. అలాగే వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన, ఆదిలాబాద్ పట్టణానికి చెందిన నల్ల శ్రేయరెడ్డికి సైతం పీజీ నీట్‌లో జాతీయ స్థాయిలో 9,350 ర్యాంకు వచ్చింది.



తల్లిదండ్రులతో రాజ్‌కుమార్ (820వ ర్యాంక్)

ఇక శునకాలకు సర్జరీలు..

- అందుబాటులోకి యానిమల్ కేర్ సెంటర్
- మూగ జీవాలకు ఆశ్రయం సైతం..
- నేడు జంతు సంరక్షణ కేంద్రం, గోశాల ప్రారంభం
- రూ.59.5 లక్షల వ్యయంతో నిర్మాణాలు
- రోడ్లపై తిరిగే పశువుల కట్టడి కఠినతరం
- తొలగనున్న ప్రజల ఇక్కట్లు



బంగారుగూడలో నిర్మించిన యానిమల్ కేర్ సెంటర్

కైలాస్‌నగర్: పట్టణంలోని ఆయా రోడ్లపై సంచరించే వీధి కుక్కలతో పాటు మూగజీవాలతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇక్కట్లు ఇక దూరం కానున్నాయి. వీటి సంరక్షణ కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో స్థానిక బంగారుగూడలో రూ.59.5 లక్షల వ్యయంతో నిర్మించిన జంతు సంరక్షణ కేంద్రం, గోశాలను బుధవారం ప్రారంభించనున్నారు. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వీధి కుక్కలను ఈ కేంద్రానికి తరలించి వాటి సంతానోత్పత్తిని నిలిపివేసేలా శస్త్రచికిత్స చేయనున్నారు. అలాగే రోడ్లపై యథేచ్ఛగా తిరిగే పశువులను గోశాలకు తరలిస్తారు. యజమానులు సకాలంలో స్పందించకుంటే వాటిని బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు.

కుక్కలకు శస్త్రచికిత్సలు..
పట్టణంలో వీధి కుక్కల బెడద అధికమైంది. రోడ్లపై గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఒంటరిగా వెళ్లే మహిళలు, వృద్ధులు, చిన్నారులపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. ఇలాంటి పరిస్థితి తొలగించాలనే ఉద్దేశంతో మున్సిపల్ ఆధ్వర్యంలో బంగారుగూడలోని డంపింగ్‌యార్డులో రూ.50 లక్షల వ్యయంతో యానిమల్ కేర్ సెంటర్ (జంతు సంరక్షణ కేంద్రం) నిర్మించారు. ఇక్కడ శునకాలకు వాటి సంతానోత్పత్తి నిలిపివేసేలా శస్త్రచికిత్స చేస్తారు. కుక్కలను పట్టేందు కోసం ఏపీలోని నెల్లూర్‌కు చెందిన ముగ్గురు వ్యక్తులను ఇప్పటికే నియమించారు. శస్త్రచికిత్సల నిమిత్తం వెటర్నరీ వైద్యుడు సురేశ్‌ను ఇన్‌చార్జిగా నియమించారు. ఆయనకు ఓ వెటర్నరీ అసిస్టెంట్ సహాయకుడిగా ఉంటారు. ఇప్పటికే రూ.3.58లక్షలతో అవసరమైన పరికరాలను కొనుగోలు చేశారు. సర్జరీ అనంతరం వాటిని కొద్ది రోజుల పాటు అక్కడే ఉంచి ఆహారం అందిస్తారు. మనుషులను కరిచినా అపాయం జరగకుండా వాటికి రేబిస్ టీకాలు కూడా వేస్తారు. తర్వాత అవి పూర్తిగా కోలుకున్నాక తిరిగి పట్టణంలో వదిలిపెడుతారు.

పశుపోషకులు తస్మాత్ జాగ్రత్త
రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు ఇబ్బంది కలిగించే మూగ జీవాలను కట్టడి చేయాలని మున్సిపల్ అధికారులు ఇప్పటికే పలుమార్లు హెచ్చరించారు. అయినా పరిస్థితిలో మార్పు లేదు. ఈక్రమంలో వాటిని అక్కడి నుంచి తరలించేందుకు బంగారుగూడ డంపింగ్‌యార్డులో రూ.9.5లక్షల వ్యయంతో గోశాల ఏర్పాటు చేశారు. నిర్వహణ బాధ్యతను గోమాత ఫౌండేషన్‌కు అప్పగించారు. యార్డులో పశుగ్రాసం పెరిగే వరకు నెల పాటు పశువులకు అవసరమైన గడ్డిని మున్సిపల్ అధికారులే అందజేస్తారు. ఎన్జీవో లోని ఇద్దరు సభ్యులకు నెలకు రూ.10వేల చొప్పున ఆరు నెలల పాటు అందజేయనున్నారు. పశువులను గోశాలకు తరలించాక వెటర్నరీ అసిస్టెంట్ ఆధ్వర్యంలో వాటికి ట్యాగ్ వేస్తారు. వ్యాక్సినేషన్‌తో పాటు వాటి ఆరోగ్య సంరక్షణను పర్యవేక్షిస్తారు. రోడ్లపై పశువుల సంచారంనకు సంబంధించిన సమాచారం మేరకు పోలీస్, మున్సిపల్, వెటర్నరీ అధికారుల సూచనతో వాటిని గోశాలకు తరలిస్తారు. ఇందు కోసం మున్సిపల్ ఆధ్వర్యంలోనే వాహనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమాచారం చేరవేత కోసం ఆయా శాఖలు, ఎన్జీవో సభ్యుల, జిల్లా ఉన్నతాధికారులతో కూడిన ఓ వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేస్తారు. జరిమానాలు, విరాళాల సేకరణతో గోశాలను నిర్వహించుకోవచ్చు. అయితే వచ్చిన విరాళాలను మున్సిపల్ అధికారి, ఎన్జీవో అధ్యక్షుడి పేరిట జాయింట్ అకౌంట్ తెరువాలని నిర్ణయించారు. విరాళాల కోసం హుండీలను సైతం ఏర్పాటు చేయనున్నారు. వాటిని ప్రతి శనివారం తెరిచి లెక్కిస్తారు.

పూర్తి సహకారం అందిస్తాం
కుక్కల సంతానోత్పత్తి కట్టడికి గాను వాటికి సర్జరీలు చేస్తాం. ఇందు కోసం ఇప్పటికే ఓ వైద్యుడు, వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమించాం. వాటికి రేబిస్ టీకాలు సైతం వేయిస్తాం. అలాగే గోశాల నిర్వహణ సాఫీగా సాగేలా ప్రేసింగ్ అనే వెటర్నరీ అసిస్టెంట్‌ను నియమించాం. జంతు సంరక్షణ చట్టానికి లోబడి నిర్వహించాల్సి ఉంటుంది. సర్జరీలతో పాటు గోశాల నిర్వహణలో ఎలాంటి సహకారం అవసరమైనా మా శాఖ ద్వారా మున్సిపల్ అధికారులకు అందజేస్తాం.– బి.కిషన్, జిల్లా వెటర్నరీ అధికారి

కట్టడి చేయకుంటే బహిరంగ వేలమే
పట్టణంలో తిరిగే మూగజీవాలను గోశాలకు తరలిస్తాం. వాటి కోసం వచ్చే యజమానులు తొలిసారి అయితే రూ.5వేలు చెల్లించి వాటిని తీసుకుపోవచ్చు. పది రోజుల వరకు వారికి సమయమిస్తాం. 11వ రోజు నుంచి రోజుకు రూ.150 చొప్పున జరిమానా విధిస్తాం. ఇలా పది రోజుల అదనపు సమయమిస్తాం. అప్పటికీ యజమానులు రాని పక్షంలో వాటిని బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తాం. లేదంటే గోశాల నిర్వహకులకే అప్పగిస్తాం. పశు పోషకులు రోడ్లపై మూగజీవాలను వదలకుండా కట్టడి చేసుకోవాలి. – శైలజ, మున్సిపల్ కమిషనర్

క్లుప్తంగా

యువతి అదృశ్యం



సీరం సుజాత (ఫైల్)

భైంసారూరల్(ముధోల్): మండలంలోని ఇలేగాం గ్రామానికి చెందిన సీరం సుజాత అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గ్రామానికి చెందిన సుజాత ఈ నెల 12న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం యువతి తల్లి విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగులమందు తాగి ఒకరు ఆత్మహత్య

ఖానాపూర్: పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని మేడంపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై ఆర్.శంకర్ తెలిపిన వివరాల ప్రకారం మేడంపల్లి గ్రామానికి చెందిన కోల జలపతి (55) తరచూ మద్యం సేవించి చనిపోతానని ఇంట్లో కుటుంబ సభ్యులను బెదిరించేవాడు. మంగళవారం సైతం ఉదయం పొలానికి వెళ్లి గుర్తుతెలియని పురుగుల మందుతాగి ఇంటికి వచ్చాడు. ఇంట్లో వాంతులు చేసుకోవడంతో గమనించిన అతని భార్య లక్ష్మి వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్తులు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

బేల(ఆదిలాబాద్): మండలంలోని కోగ్ధూర్ గ్రామ శివారులోని పెన్‌గంగ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. నాలుగు ట్రాక్టర్లను అడ్డుకుని స్థానిక ఆలయాల ప్రాంగణాలకు తరలించారు. ట్రాక్టర్ల టైర్లలో గాలి తీసేసారు. అధికారులు వచ్చేదాకా ట్రాక్టర్లు వదిలేది లేదని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఆర్‌ఐ గీత గ్రామానికి వెళ్లి ట్రాక్టర్లకు జరిమానా వేస్తామని, సదరు యజమానులపై చర్యలు తీసుకుంటామని చెప్పినా శాంతించలేదు. సాయంత్రం ఎస్సై కృష్ణకుమార్ వెళ్లి వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, తగు చర్యలు తీసుకుంటానని ఎస్సై హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్



మాట్లాడుతున్న కాంతిలాల్ పాటిల్

భైంసాటౌన్:ఇటీవలి కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని, అపరిచితులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతా, ఓటీపీ వంటి వివరాలు తెలుపొద్దని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ సూచించారు. పట్టణంలోని రాహుల్‌నగర్‌లో మంగళవారం ఉదయం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని 52 బైక్‌లు, మూడు కార్లు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీ వాసులతో నిర్వహించిన సమావేశంలో ఏఎస్పీ మాట్లాడారు. మొబైల్ ఫోన్లకు వచ్చే అపరిచిత మెసేజ్, కాల్స్‌కు స్పందించొద్దని తెలిపారు. సీఐ ఎల్.శ్రీను మాట్లాడుతూ.. కాలనీవాసులు కమిటీగా ఏర్పడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానితులు కనిపించినా, పోలీసుల సహాయం అవసరమైనా డయల్ 100కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు, కానిస్టేబుళ్లు ఉన్నారు.

ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు



కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఏఎఫ్ పోలీసులు

నిర్మల్: జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించారు. నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో వీధుల గుండా సాగింది. హకీంపేటకు చెందిన 99 ఆర్‌ఏఎఫ్ బెటాలియన్ డిప్యూటీ కమాండెంట్ శ్రీకాంత్, 75మంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మేలుకో.. తెలుసుకో..



పాతమంచిర్యాల: మార్కెట్‌లో మనం కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుకు తప్పనిసరిగా రశీదు పొందాలి. ఆ రశీదును భద్రపరుచుకోవాలి. ఎందుకంటే ఆ చిన్న రశీదుకు మీ హక్కులను రక్షించే శక్తి ఉంది. అందుకే ఏదైన వస్తువు కొన్నప్పుడు దాని రశీదును జాగ్రత్తగా కాపాడుకోవాలి. కొన్న వస్తువులు నకిలీవి అని తేలినప్పుడు మన వద్ద రశీదు లేకుంటే మనం ఏమీ చేయలేని పరిస్థితి. కొన్న వస్తువు నాణ్యతలోపంతో ఉన్నట్లయితే న్యాయపోరాటం చేయడమే మనకున్న ఏకైక మార్గం. ఇది మన హక్కు కూడా. ఈ న్యాయపోరాటంలో వినియోగదారుడు ఉత్పత్తిదారుడి నుంచి పరిహారం పొందే వీలుంటుంది. దానికంటేముందు కొనే వస్తువు సేవల్లో నాణ్యత, స్వచ్ఛత ఉండాలనే విషయం వినియోగదారులు ముందుగా తెలుసుకోవాలి. వస్తువు ఉపయోగించడానికి తగ్గట్లుగా లేకున్నా.. ప్రాణ, ఆస్తి నష్టం కలిగించేలా ఉన్నా ఆ వస్తువులు అమ్మినవారిపై ఫిర్యాదు చేసి తమ హక్కును కాపాడుకోవడమే వినియోగదారుల హక్కుల్లో ఉండే మొదటి అంశం.

- వస్తు సేవల్లో మోసాలపై జాగ్రత్త
- ప్రతీ కొనుగోలుకు రశీదు తప్పనిసరి
- లేదంటే నష్టపోవాల్సిన పరిస్థితి
- నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

ఇదీ.. చారిత్రక నేపథ్యం..

1962 మార్చి 15న అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ దేశ పౌరుల కోసం ప్రప్రథమంగా వినియోగదారుల హక్కులు ప్రకటించారు. అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల సంస్థ ప్రాంతీయ సంచాలకులు మార్చి 15ను ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవంగా పరిగణించాలని తీర్మానించారు. దీంతో 1973 నుంచి ప్రపంచ దేశాలు దీన్ని పాటించడం ప్రారంభించాయి. మన దేశంలో 1986లో వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం ప్రభుత్వం వినియోగదారులకు ఆరు హక్కులు ప్రసాదించింది.

ఇందులో వినియోగదారులకు రక్షణహక్కు, సమాచార హక్కు, వస్తు సేవలందుకునే హక్కు, ప్రాతినిథ్య హక్కు, విజ్ఞాపన హక్కు, వినియోగదారుల విద్యా హక్కు, స్వచ్ఛమైన పర్యావరణ హక్కు ఉన్నాయి.

- **వినియోగదారుల రక్షణ హక్కు:** మానవ ప్రాణాలు, ఆస్తికి ప్రమాదకర వస్తువుల వలన రక్షణ పొందే హక్కు.
- **సమాచారం పొందే హక్కు:** అవాంఛిత వ్యాపార కార్యకలాపాల నుంచి వినియోగదారులకు రక్షణ కల్పించడానికి, వస్తువుల నాణ్యత బరువు స్వచ్ఛత గురించి తెలిపే హక్కు.
- **వస్తువులు, సేవల ఎంపిక హక్కు:** వివిధ రకాల వస్తువుల కొనుగోలు, ఆ వస్తువుల సేవలు పొందడానికి వాటి రేటు నాణ్యత తెలుసుకోవడం, నాణ్యమైన సేవలు పొందడం.
- **ప్రాతినిథ్యం వహించే హక్కు:** వినియోగదారుల హక్కులు, ఆసక్తిని వారి అవసరాలను సరైన వేదికలో ఫోరంలో వినిపించడం, వినియోగదారుల సంక్షేమార్థం వివిధ వేదికలలో ప్రాతినిథ్యం వహించడం.
- **వస్తు, సేవ లోపాల నుంచి పరిహారం పొందే హక్కు:** వినియోగదారులు మోసాలకు గురైనప్పుడు ఫోరంలో విజ్ఞప్తి చేయడం ద్వారా పరిహారం పొందడం.
- **వినియోగదారుల విద్యాహక్కు:** వినియోగదారులు నిరంతరం తమ హక్కులను తెలుసుకుంటూ తమ జ్ఞానం, నైపుణ్యాలను పెంచుకోవడం.
- **స్వచ్ఛమైన పర్యావరణ హక్కు:** పర్యావరణానికి ఎలాంటి కీడు జరగకుండా వస్తువులు, సేవలు పొందడం వినియోగదారుల హక్కు.

సమస్యల పరిష్కార వేదికలు

వినియోగదారులకు తక్కువఖర్చుతో త్వరగా వివాదాలు పరిష్కరించడానికి ప్రభుత్వం వివిధ రకాల పరిష్కార వేదికలు ఏర్పాటు చేసింది. జాతీయ, రాష్ట్ర వినియోగదారుల పరిష్కార సంఘాలతో పాటు జిల్లాలో వినియోగదారుల పరిష్కార వేదిక జిల్లా కోర్టును డిస్ట్రిక్ట్ ఫోరంగా వ్యవహరిస్తారు. ఈ వేదికలు క్వాసీ జ్యుడీషియల్ యంత్రాంగంగా పని చేస్తాయి.

వినియోగదారుల రక్షణ చట్టం-2020

వినియోగదారుల రక్షణ చట్టాన్ని 1986లో భారత పార్లమెంట్‌లో ప్రవేశపెట్టగా అది 1987 డిసెంబర్‌లో దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. చట్టం అమలులో ఉన్నప్పుడు మార్కెట్ పరిధి చాలా తక్కువ. ఆ సమయంలో సూపర్ మార్కెట్లు, ఈ కామర్స్ వంటివి లేవు. ఇప్పుడున్నట్లు ఇతర దేశాలతో వస్తువుల ఎగుమతి, దిగుమతులు ఉండేవి కావు. దీంతో పాత చట్టాల ప్రకారం ఫిర్యాదులు చేయడం సమస్యగా మారడంతో భారత ప్రభుత్వం 2020లో కొత్తచట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ చట్టంలో ప్రస్తుత మార్కెట్ విధానాలకు తగ్గట్లుగా పలు అంశాలు చేర్చారు. ఆన్‌లైన్‌లోనూ ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. ఫిర్యాదులను 48గంటల్లో స్వీకరించి వాటిని నెల రోజుల్లో పరిష్కరించేలా సూచనలు చేశారు. వీలైతే ఫాస్ట్‌ట్రాక్ ప్రాతిపదికన ఫిర్యాదులు పరిష్కరించే కీలక సంస్కరణలు చేశారు. వస్తువులు ఉత్పత్తి చేసే కంపెనీలు వాటిపై జవాబుదారీ తనం ఉండేలా చట్టంలో జోడించారు. వస్తువులు కొన్నచోటనే కాకుండా ఎక్కడైనా కేసు వేసే అవకాశం కల్పించారు. వినియోగదారులకు ఉండే హక్కులు వాటిని పరిష్కరించుకునే మార్గాలను స్పష్టంగా పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గంగాధర్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్సీ గంగాధర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. పది గ్రామాలకు ఒకటి, మున్సిపాలిటీలో నాలుగు వార్డులకు ఒకటి చొప్పున చేపడుతున్నామన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎమ్మెల్యే జోగు రామన్న, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ ఎంపీ గొడం నగేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్ పాల్గొన్నారు.

ఆస్పత్రిని తనిఖీ చేసిన ప్రిన్సిపాల్



పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ జేవీడీఎస్ ప్రసాద్

నిర్మల్: నిర్మల్ మెడికల్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన జేవీడీఎస్ ప్రసాద్ మంగళవారం రాత్రి జిల్లా ఆస్పత్రిని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని పలు వార్డులలో తిరిగారు. సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. రోగులను సేవల గురించి అడిగారు. వారంలో ఎన్‌ఎంసీ బృందం రెండోవిడత తనిఖీకి రానున్న నేపథ్యంలో ఆయన పరిశీలించినట్లు సిబ్బంది తెలిపారు.

సారా తయారుచేస్తే కఠినచర్యలు



కుంటాలలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

నేరడిగొండ(బోథ్): నాటుసారా తయారుచేస్తే కఠిన చర్యలు తప్పవని ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ రాజమౌళి హెచ్చరించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని నేరడిగొండ మండలం పెద్దబుగ్గారం, కుంటాల, పీచర గ్రామాల్లో మంగళవారం దాడులు నిర్వహించారు. బుగ్గారంలో 60 లీటర్ల బెల్లంపానకం ధ్వంసం చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. రాథోడ్ కృష్ణ, పాలత్య వీణలపై కేసు నమోదు చేశారు. పీచర, కుంటాల గ్రామాల్లో నాటుసారా, గంజాయిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ దాడుల్లో ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎ.రాకేష్, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ జి.లక్ష్మరావు, ఇచ్చోడ ఎక్సైజ్ ఎస్సై పి.రాజేశ్వర్, నేరడిగొండ పోలీసు సిబ్బంది రమాకాంత్, హెడ్‌కానిస్టేబుల్ గణేశ్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

'కడెం'ను ఆధునికీకరించాలి

- జల సాధన సమితి అధ్యక్షుడు నైనాల గోవర్దన్



మాట్లాడుతున్న నైనాల గోవర్దన్

కడెం(ఖానాపూర్): కడెం ప్రాజెక్టును ఆధునీకరించాలని తెలంగాణ జల సాధన సమితి అధ్యక్షుడు నైనాల గోవర్దన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలోనే కుప్టి ప్రాజెక్ట్ నిర్మాణానికి ప్రాథమిక సర్వే నిర్వహించారని, ఆతర్వాత వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం సమగ్ర ప్రాజెక్ట్ నివేదికను రూపొందించినా ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టలేదన్నారు. కడెం ప్రాజెక్టుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా ఎగువన కుప్టి ప్రాజెక్టును పూర్తిచేసి కడెం ప్రాజెక్టును పది ఫీట్ల ఎత్తు పెంచాలని, అదనంగా మరో ఇరవై వరద గేట్లను ఏర్పాటు చేసి కడెం చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలన్నారు. శ్రీరాంసాగర్ కాకతీయ కాలువకు సమానంగా మరో కాలువ లేదా అంతర్గత పైపులైన్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి వేదిక అధ్యక్షుడు కొండేటి సత్యనారాయణ, చిన్నయ్య, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

బోథ్ డివిజన్ ఏర్పాటయ్యేనా?

- రెండు విడతల్లో దక్కని చోటు
- ఏళ్లుగా డిమాండ్ చేస్తున్న ప్రజలు
- డివిజన్ ఏర్పాటు చేస్తే పాలన మరింత సులువు



బోథ్‌లోని తహసీల్దార్ కార్యాలయం

బోథ్: బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం ఆందోళనలు సైతం చేపట్టారు. కానీ ప్రభుత్వం ఆదిశగా అడుగులు వేయడంలేదు. జిల్లాల పునర్విభజన తరువాత బోథ్‌ను డివిజన్ చేయాలన్న డిమాండ్ ఊపందుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతలుగా కొత్త రెవెన్యూ డివిజన్‌లను ఏర్పాటు చేసింది. గతంలో పరకాల, హుజూర్ నగర్, వేములవాడ, జోగిపేటలను రెవెన్యూ డివిజన్‌లుగా ఏర్పాటు చేసింది. కానీ అందులో బోథ్‌కు మాత్రం అవకాశం దక్కలేదు.

ప్రస్తుత జిల్లాలతో సమానంగా...

నియోజకవర్గ కేంద్రమైన బోథ్ ఒకప్పుడు తాలూకా కేంద్రంగా వెలుగొందింది. ప్రస్తుత జిల్లాలైన ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్‌లతో పాటు బోథ్ తాలుకాగా ఉండేది. నిజాం కాలం నాటి నుండే ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఉండేది. బోథ్ తాలుకాలో నాలుగు మండలాలు, కిన్వట్, శివిని ప్రాంతాలు ఉండేవి. దీంతో జిల్లా కేంద్రాలతో పాటు సమానంగా కోర్టు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, డివిజన్ కార్యాలయాలతో పాటు ఇతర డివిజన్ కార్యాలయాలు ఉండేవి. ప్రస్తుతం ఆదిలాబాద్, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాలుగా ఉట్నూరు రెవెన్యూ డివిజన్‌గా కొనసాగుతున్నాయి. బోథ్ మాత్రం కేవలం మండలంగా మాత్రమే ఉంది. దీనికి తోడు ఇక్కడి కార్యాలయాలన్నీ ఇతర ప్రాంతాలకు తరలించారు.

డివిజన్‌గా ఏర్పాటు చేస్తే మరింత పాలన..

బోథ్ నియోజకవర్గంలో బోథ్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ, నేరడిగొండ, సిరికొండ, గుడిహత్నూర్, తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాలు ఉన్నాయి. మొత్తం 9 మండలాల్లో బోథ్, బజార్‌హత్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ మండలాలను కలిపి డివిజన్ చేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. దీంతో పాలన ప్రజలకు మరింత చేరువయ్యే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం బోథ్ నియోజకవర్గంలోని 9 మండలాలు ఆదిలాబాద్ డివిజన్‌లో ఉన్నాయి. బోథ్ మారుమూల గ్రామాల నుండి ఆదిలాబాద్‌కు వెళ్లాలంటే కనీసం 80 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. జిల్లా కేంద్రానికి వెళ్లిన తరువాత అధికారులు అందుబాటులో లేకపోతే మళ్లీ రావాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో దూరభారంతో పాటు ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. నాలుగు మండలాలను కలిపి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తే పాలన సౌకర్యం ఏర్పడుతుందని మేధావులు పేర్కొంటున్నారు.

ఇబ్బందులు తొలగుతాయి



బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజలకు పాలనా పరమైన ఇబ్బందులు తొలగిపోతాయి. ప్రస్తుతం రెవెన్యూ, ఇతరత్రా పనుల కోసం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తోంది. నాలుగు లేదా ఐదు మండలాలను కలిపి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తే ఇక్కడి ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది.

– అల్లం సాయికృష్ణ, బోథ్

ప్రజల ఆకాంక్షను గుర్తించాలి



బోథ్‌ను డివిజన్ చేయాలని కొన్నేళ్లుగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. ఇతర జిల్లాల్లో రెండు విడతలుగా నాలుగు కొత్త రెవెన్యూ డివిజన్‌లను ఏర్పాటు చేశారు. బోథ్‌ను డివిజన్ చేసేందుకు అన్ని అర్హతలున్నాయి. ప్రజల ఆకాంక్షను ప్రభుత్వం గుర్తించాలి.– గట్ల గంగాధర్, వీడీసీ అధ్యక్షుడు

అభివృద్ధికి ఆస్కారం..

బోథ్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందే ఆస్కారం ఉంది. వివిధ శాఖలకు చెందిన డివిజన్ కార్యాలయాలు బోథ్‌లోనే ఏర్పాటవుతాయి.

అర్ధరాత్రి కంటైనర్ హైజాక్

- నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఘటన
- రూ.4 లక్షల విలువైన వస్తువులు మాయం
- ఘటనపై పలు అనుమానాలు



కంటైనర్ డ్రైవర్ నుంచి వివరాలు సేకరిస్తున్న బాల్కొండ ఎస్సై

ఇచ్చోడ(బోథ్): ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ సరిహద్దు ప్రాంతంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కంటైనర్‌ను హైజాక్ చేసిన సంఘటన సంచలనం సృష్టించింది. నాగ్‌పూర్ నుంచి హల్దీరాంలోడ్‌తో హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్‌ను కారులో వచ్చిన కొంత మంది దుండగులు అడ్డుకున్నారు. డ్రైవర్‌ను కారులో ఎక్కించుకున్న దుండగులు కంటైనర్‌ను వెంట తీసుకుని వెళ్లారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ జాతీయరహదారి పక్కన డ్రైవర్‌తో పాటు కంటైనర్‌ను వదిలి వెళ్లారు. డ్రైవర్ ప్రఫుల్ ఆనంద్‌రావు మంగళవారం ఉదయం బాల్కొండ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కంటైనర్ హైజాక్‌కు గురైందని ఫిర్యాదు చేశారు. కానీ అందులో ఉన్న వస్తువులు ఎక్కడ ఖాళీ చేశారన్న విషయం తనకు తెలియదని, తనను దుండగులు కారులో బంధించి ఉంచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అందులో ఉన్న రూ.4 లక్షల విలువైన వస్తువులు అర్ధరాత్రి రెండు గంటల వ్యవధిలో ఎక్కడ దాచారని పోలీసులు విచారణ చేస్తున్నారు. అంతేకాకుండా కంటైనర్‌లో ఉన్న కొంత సరుకును నేరడిగొండ మండల కేంద్రంలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ముందస్తు ప్లాన్ ప్రకారమే అంతాకలిసి హైజాక్ కథ నడిపించారన్న కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఇచ్చోడ సీఐ నైలు నాయక్‌ను వివరణ కోరగా హైజాక్‌కు గురైన కంటైనర్‌ను దుండగులు బాల్కొండ వద్ద వదిలివెళ్లినట్లు తెలిపారు. కంటైనర్ డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు ఆయన పేర్కొన్నారు.



ప్రమాదకర ప్రయాణం

ద్విచక్ర వాహనంపై ఒక్కరు లేదా ఇద్దరు మాత్రమే ప్రయాణించాలన్నది నిబంధన. కానీ ఇలా టీవీఎస్ మోపెడ్‌పై ఏకంగా ఐదుగురు ప్రమాదకరంగా ఇలా ప్రయాణిస్తున్నారు. ఏమాత్రం పట్టు తప్పినా ప్రాణాలు గాలిలో కలిసిపోయే ఆస్కారమున్న ఈ దృశ్యం మావల మండల కేంద్ర సమీపంలోని జాతీయ రహదారిపై కన్పించింది.

-సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్